సాక్షి చిత్తూరు
బుధవారం ၊ 24 ၊ ఏప్రిల్ ၊ 2024



వైఎస్సార్‌సీపీ వెంటే దళితులు

జిల్లాలోని దళితులు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, సునీల్ కుమార్ తెలిపారు. - 8లో



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి పలువురు నేతలు వైఎస్సార్‌పీలో మంగళవారం చేరారు. - 8లో



కాషాయం జెండా తీసేయండ్రా..!

టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి జగన్‌మోహన్ ఇటీవల బీజేపీ కండువాల వేసుకునేందుకు విముఖత చూపుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

జగనన్నతోనే సంక్షేమ పాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని వరత్తూరు పంచాయతీలో ఎంపీపీ అనితతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని సూచించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చే చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరో 30 ఏళ్లపాటు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ముని రాజారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరక నెల్లూరు కోదండన్, వరత్తూరు సర్పంచ్ నరసింహులు, హరీష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లోకనాథరెడ్డి, లక్ష్మీ, జేసీయస్ కన్వీనర్ అయ్యప్ప రెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి, చెంగల్ రెడ్డి, మణి, వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

29 నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ఈనెల 29 నుంచి వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమవుతున్నందున, శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ మేరకు గ్రంథాలయ సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేసి విద్యార్థులు శిబిరాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

కర్ణాటక ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ సంస్థలు, పరిశ్రమలు, దుకాణాల్లో పనిచేసే కర్ణాటకకు చెందిన ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కర్ణాటకలో ఈ నెల 26, మే 7వ తేదీన రెండు దశలుగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున ఇక్కడ పనిచేస్తున్నవారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సెలవు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని కర్ణాటక ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిత్తూరు ఎస్‌బీ సీఐ బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎం.గంగిరెడ్డిని బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో గంగిరెడ్డి రిపోర్టు చేయాలని పేర్కొంది.

నేటి నుంచి బడులకు వేసవి సెలవులు

- జూన్ 12న పునఃప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈనెల 24 వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం చివరి పనిదినం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివిన విద్యార్థుల సమ్మేటివ్-2 పరీక్షల ఫలితాలను టీచర్లు వెల్లడించారు. జూన్ 11 వ తేదీ వరకు వేసవి సెలవులు ఉంటాయని జూన్ 12వ తేదీన నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల్లో ఉంటున్న పాఠశాల విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లారు. వేసవి సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని డీఈఓ దేవరాజు హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 62,894 మంది స్వామివారిని దర్శించుకోగా 22,894 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభయమిస్తూ.. ఆయువు పోస్తూ..!



గాలి.. వెలుతురు సరిగా రాని గదులు. పడకలు లేక వరండాల్లోనే కూలబడి ఉసూరుమనే రోగులు. అందుబాటులో లేని మందులు.. పరికరాలు. సక్రమంగా విధులకు హాజరుకాని వైద్యులు.. పేషెంట్ ప్రాణం మీదకు వచ్చినా సకాలంలో అందని చికిత్సలు. ఇదీ గతంలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి. సర్కారు దవాఖానాకు ఎందుకొచ్చాం దేవుడా అంటూ ప్రజలు కన్నీటిపర్యంతమయ్యేవారు. ఈ పరిస్థితుల్లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టింది. నాడు–నేడు కింద ఆస్పత్రులను కార్పొరేట్ హాస్పిటళ్లను తలదన్నేలా అత్యున్నతంగా తీర్చిదిద్దింది. పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించింది. అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కొరత లేకుండా వైద్యసిబ్బందిని నియమించింది. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను సమకూర్చింది. ప్రజారోగ్య పరిరక్షణకు వేలాది కోట్లరూపాయలు వెచ్చించింది. అయితే స్వార్థపూరితమైన అజెండాతో ప్రభుత్వాస్పత్రులపై ఎల్లో మీడియా విషం కక్కుతోంది. ఉన్నది లేనట్టు అసత్య కథనాలు వండి వారుస్తూ..ప్రజలను నమ్మించేందుకు విఫలయత్నం చేస్తోంది.

- ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేసిన ప్రభుత్వం
- వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- నాడు–నేడు కింద ఆస్పత్రుల ఆధునీకరణ
- అభివృద్ధి పథంలో పీహెచ్‌సీలు.. సీహెచ్‌సీలు
- అందుబాటులో అత్యున్నత వసతులు.. పరికరాలు
- ఫ్యామిలీ డాక్టర్ కింద పల్లె ముంగిటకే సేవలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతిరోజూ 10వేలకు పైగా ఓపీలొస్తున్నాయి. ఐదేళ్లకు ముందు ఓపీలు 8వేలు దాటేవి కాదు. కారణం ఆస్పత్రులకు డాక్టర్లు సక్రమంగా వచ్చేవారు కారు. వచ్చినా మధ్యాహ్నానికే తలుపులు వేసి వెళ్లిపోయేవారు. మందులు, మాత్రలు పూర్తిస్థాయిలో ఉండేవి కాదు. ప్రధానంగా వసతులు శూన్యం, కనీసం కాలకృత్యాలకు కూడా సిబ్బంది, వైద్యులు ఇబ్బందిపడేవారు. ఆస్పత్రికి వచ్చే రోగులు తాగునీటికి కూడా అల్లాడిపోయేవారు. దీంతో రోగుల సంఖ్య బాగా తక్కువగా ఉండేది. దీంతో వైద్య సేవలకు ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల బాటపట్టేవారు.

నేడు మెరుగైన వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని ఆస్పత్రుల్లో మార్పులు వచ్చాయి. ఆపరేషన్, సిజేరియన్ల సంఖ్యను పెరిగింది. పీహెచ్‌సీల్లో నిరంతర సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను పోత్సహిస్తున్నారు. దీంతో ప్రతినెల 300లకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. 214 రకాల మందులు, మాత్రలు అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. ప్రతి పీహెచ్‌సీలోనూ 14 మంది సిబ్బందిని నియమించింవది. ల్యాబ్ పరీక్షల సంఖ్యను పెంచింది. ఫలితంగా పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాగే సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సైతం వైద్యసేవలు పుంజుకున్నాయి.

కోవిడ్ కట్టడిలో..

కరోనా సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కవచంలా నిలిచింది. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల ద్వారా ఇంటింటా సర్వే చేపట్టి కరోనా పాజిటివ్ కేసులను గుర్తించి బాధితులు కోలుకునేంత వరకు అండగా నిలబడింది. మొత్తం 36 కోవిడ్ సెంటర్లను, 19 ల్యాబ్‌లు, నిత్యం 12 వేల పరీక్షలు చేపట్టింది. ఈ క్రమంలో మొత్తం 35,67,999 పరీక్షలు చేయగా..2,77,785 పాజిటివ్ కేసులను గుర్తించింది. వారికి ఆరోగ్య భద్రతతోపాటు కోలుకునే వరకు ఉచిత సేవలను అందించింది. ఇందుకు గాను రూ.53.8 కోట్లు వెచ్చించింది. వైద్య సిబ్బంది జీతభత్యాల కోసం రూ.20 కోట్లు ఖర్చు పెట్టింది.



ఈనాడులో ప్రచురితమైన కథనం

పలమనేరు ఏరియా ఆస్పత్రిని చూద్దాం..



పలమనేరు ఏరియా ఆస్పత్రిని గతంలో టీడీపీ సర్కారు నిర్లక్ష్యం చేసింది. తర్వాత కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 50 బెడ్లతో ఆస్పత్రిని నిర్మించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ ఈ ఆస్పత్రిని చిన్నచూపు చూసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఆస్పత్రిని వందపడకలుగా మార్చింది. రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. ఇప్పటికే ఆస్పత్రిలోని ఐదు బ్లాకులతో పాటు అదనంగా మరో ఐదుబ్లాకులు నిర్మిస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ,బర్న్స్ యూనిట్, ఐసొలేషన్ వార్డ్, 21 బెడ్లతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ప్రత్యేకంగా 21 బెడ్లతో లేబర్ బ్లాక్, ఓటీ కాంప్లెక్స్, రేడియాలజీ మరియు ల్యాబ్స్, ఆర్థో, జీఎస్ అండ్ జీఎం, ఐ అండ్ ఈఎన్‌టీ పది బెడ్లు, పే రూమ్స్, బ్లడ్ బ్యాంకు, క్యాంటిన్, బయో మెడికల్ వేస్ట్, మార్చురీల ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఆక్సిజన్‌ప్లాంట్ పనులు పూర్తయ్యాయి.

ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్‌లను నెలకొల్పింది.

సిబ్బంది కొరతకు చెక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 457పోస్టులను అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసింది. డీసీహెచ్‌ఎస్ పరిధిలో 335, ఎన్‌హెచ్‌ఎం పరిధిలో 568 పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరతకు చెక్ పెట్టింది.

అభివృద్ధికి నిధులు

జిల్లాలో 11 నూతన యూపీహెచ్‌లు మంజూరు చేసింది. ఒక్కోదాని అభివృద్ధికి రూ. 80 లక్షల చొప్పున నిధులు వెచ్చించింది. విలేజ్ క్లినిక్‌లకు రూ. 20.80 లక్షలు వ్యయం చేసింది. నాడు–నేడు కింద పీహెచ్‌సీలకు పనుల ఆధారంగా రూ. 8 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చు పెట్టింది. దీంతో పీహెచ్‌సీలకు కొత్త రూపం దాల్చుకున్నాయి. దీంతో పాటు పీహెచ్‌సీలు, క్లినిక్‌లకు అన్ని రకాల పరికరాలు అందజేసింది.

అత్యవసరానికి 108 వాహనాలు

గతంలో 108 సేవలు అరకొరగా ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలానికి ఒకటి చొప్పున 108 వాహనాలను కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 33 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు . ఇవి అత్యవసర సమయంలో బాధితులకు అండగా నిలబడుతున్నాయి.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	01
పీహెచ్‌సీలు	50
సీహెచ్‌సీలు	08
ఏరియా వైద్యశాలలు	04
విలేజ్ క్లినిక్‌లు	464
అర్బన్ హెల్త్ సెంటర్లు	15

బురదజల్లడమే లక్ష్యంగా ఎల్లోమీడియా

ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఎల్లోమీడియా విశ్వప్రయత్నం చేస్తోంది. చంద్రబాబు డైరెక్షన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఎన్నికల దృష్ట్యా ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు కుయుక్తులు పన్నుతోంది. అందులో భాగంగా ప్రభుత్వంపై కక్ష కట్టి తప్పుడు కథనాలు రాస్తోంది. జరిగిన అభివృద్ధిని జరగలేదంటూ ప్రజల కళ్లకు గంతలు కట్టేందుకు తెగబడుతోంది. చిన్న చిన్న సమస్యలనే భూతద్దంలో పెట్టి చూపిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో వాస్తవాలు గ్రహించిన ప్రజలు ఇదెక్కడి అన్యాయం అంటూ ఎల్లోమీడియా వైఖరిపై మండిపడుతున్నారు.



చాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో పడకలు



అత్యాధునిక ఈసీజీ కేంద్రం

చక్కగా వైద్యసేవలు



గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళితే ఎవరూ ఉండేవారు కాదు. సిబ్బంది చూసీ చూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. మందులు కూడా ఇచ్చేవారు కాదు. ఇప్పుడు అలా లేదు. వైద్యులు చక్కగా చూస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. ప్రసవాలు కూడా ఇక్కడే చేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు పొద్దుపోయే వరకు ఉంటున్నారు. రాత్రి వేళల్లో నర్సులు ఉంటున్నారు. ఎప్పుడు వెళ్లినా వైద్యసేవలందిస్తున్నారు.

– అముద, చిత్తూరు

బాగా చూస్తున్నారు



గతంలో బీఎస్‌ఆర్‌పేట ఆరోగ్య కేంద్రం అంత బాగా ఉండేది కాదు. డాక్టర్లు ఉండేవారు కారు. సిబ్బంది లేక ఒకరు ఇద్దరితో నెట్టుకొచ్చేవారు. ఇప్పుడు 14 మంది సిబ్బంది సేవ చేస్తున్నారు. మంచిగా వైద్యం చేస్తున్నారు. రోగులను బాగా చూసుకుంటున్నారు. మందులు, మాత్రలతో పాటు ల్యాబ్ పరీక్షలు కూడా ఇక్కడే చేస్తున్నారు.. క్యాంపులు పెట్టి ఇంటికాడే పరీక్షలు చేసి మా బాగోగులను చూసుకున్నారు. ఇంతకు మించి వైద్య సేవలు ఎవరూ చేయలేరు.

– మలర్, చిత్తూరు

రీల్స్ రాజా.. గురజాల

ప్రజల కష్టం తెలిసిన వారు.. పేదల స్వేదం విలువ తెలిసిన వారు.. జవాబుదారీతనంలో బాధ్యతలు నిర్వర్తించేవారు తమ ప్రతినిధిగా చట్టసభల్లోకి అడుగుపెట్టాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు.. అయితే డబ్బుంటే చాలు.. ఎన్నికల్లో పోటీ చేయడానికి మరే అర్హత అవసరం లేదని చంద్రబాబు మరోమారు నిరూపించారు. పార్టీ కోసం త్యాగాలను చేసిన వారు.. ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడిన వాళ్లు.. ఏళ్ల తరబడి జెండాలు మోసిన నేతలను గాలికి వదిలేశారు. రూ.కోట్లకు పడగలెత్తడమే ప్రధాన అర్హతగా భావించి.. బెంగళూరు నుంచి ఊడిపడిన గురజాల జగన్‌మోహన్‌నాయుడుని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలకు కనీస పరిచయం లేని వ్యక్తిని స్థానిక నేతల నెత్తినపెట్టారు. తీరా ఆయన వ్యవహారశైలి చూస్తే విలువలకు తిలోదకాలిచ్చినట్టే కనిపిస్తోందని ఆ పార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న సదరు అభ్యర్థి వీడియోలు.. రీల్స్ చూసిన టీడీపీ నేతలు సైతం ఇదెక్కడి విపరీతం అంటూ తలలు పట్టుకుంటున్నారు.

- విలాసవంత జీవనశైలిలో గురజాల జగన్‌మోహన్ నాయుడు
- ప్రజల కష్టం తెలియని వ్యక్తికి టీడీపీ టికెట్
- రికార్డింగ్ డ్యాన్సులు.. బైకుపై స్టంట్లు.. తుపాకులతో వీడియోలు
- ఇప్పటి వరకు చిత్తూరు వాసులకు చేసిందేమీలేదు!
- ఓడిపోతే మళ్లీ బెంగళూరుకే మకాం..!



ఓ వృద్ధురాలు సమస్య చెబుతుంటే బైకుపై కూర్చుని నిర్లక్ష్యంగా వింటున్న గురజాల



రికార్డింగ్ డాన్సులు వేస్తూ.. వీడియోలకు ఫోజులిస్తూ ..




తుపాకులు పట్టుకున్న అంగరక్షకుల మధ్య టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్

చిత్తూరు అర్బన్ : టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌నాయుడు (జీజేఎం) ప్రచారానికి వెళితే రూ.కోట్ల విలువ చేసే వాహనాల శ్రేణి, ఖరీదైన వ్యక్తులు తప్ప సామాన్యులు కనిపించరు. జీజేఎం రోజుకు పట్టుమని అయిదు కిలో మీటర్లు కూడా నడిచి తిరగలేని పరిస్థితి. ఎందుకంటే ఆయన జీవన శైలి మొత్తం విలాసవంతంగా కనిపిస్తుంది. కష్టపడి పనిచేసే పేదల బతుకు పోరాటంపై ఆయనకు ఏమాత్రం అవగాహన లేదు. అలాంటిది చిత్తూరు నియోజకవర్గంలో ప్రజల మన్ననలు పొందడం జీజేఎంకు చాలా కష్టమని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా సొంత పార్టీలోని సీనియర్లకు సైతం ఆయన వ్యవహారశైలి నచ్చడంలేదనే విమర్శలున్నాయి. ఇటీవల పార్టీలోకి వచ్చిన ఓ సీనియర్ నాయకుడి అనుచరులు తన ప్రత్యర్థితో మాట్లాడుతున్నారా...? అని ఆరా తీయడం వాళ్లకు తెలిసి పోయి గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పార్టీలో కురువృద్ధుడిగా ఉన్న వ్యక్తిని నమ్ముకుంటే నట్టేట మునిగిపోవడం ఖాయమని, అందుకే తన ప్రణాళికలు తనకు ఉన్నట్లు సన్నిహితులతో చెప్పుకుంటున్నట్లు టీడీపీ నేతలు గుసగుసలాడుతున్నారు. ఇక టికెట్ రాకపోవడంతో నిస్తేజంలో ఉన్న టీడీపీలోని కాపు నాయకులను అస్సలు నమ్మడంలేదని, వీళ్ల వల్ల తనకు వంద ఓట్లు కూడా పడవని జీజేఎం ఓ యువ నేత వద్ద అన్నట్లు తెలుస్తోంది. తాను కేవలం క్షేత్రస్థాయిలో ఓటర్లను నమ్ముతానే తప్ప, వెన్నంటే ఉంటూ తనపై బురదజల్లేవారిని నమ్మడంలేదని పలు సందర్భాల్లో వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. 20 ఏళ్లల్లో ఎపుడూ చిత్తూరులో కనిపించని వ్యక్తి, రేపు ఎన్నికల్లో ఓడిపోతే, బెంగళూరుకు వెళ్లిపోకుండా స్థానికంగా అందుబాటులో ఉంటారని ఎలా నమ్మగలమని సామాన్య కార్యకర్తలు అనుమానిస్తున్నారు.

అడ్డదిడ్డంగా వీడియోలు..!

సామాజిక మాధ్యమాల్లో జీజేఎం చేసిన రీల్స్, వీడియోలను చూస్తుంటే కొందరు నవ్వుకుంటుంటే, మరికొందరు అసహ్యించుకుంటున్నారు. ఇటీవల వైరల్‌గా మారిన ఆయన వీడియోలు చూసిన ప్రజలు ఇదెక్కడి వేషాలు బాబోయ్ అని మండిపడుతున్నారు. వాటిల్లో కొన్నింటిని పరిశీలిస్తే..

- బైకు నడిపేటపుడు హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాదం జరిగినా ప్రాణహాని ఉండదు. పైగా వేగంగా బైకును పోనిచ్చి, రెండు చేతులు వదిలేస్తూ స్టంట్లు చేస్తే..? కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలి. పైగా ప్రభుత్వ రహదారులపై ఇలాంటివి చేసేపుడు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నది నిబంధన. కానీ చిత్తూరు టీడీపీ అభ్యర్థి ఈ నిబంధనలను తుంగలో తొక్కి బైకు వేగంగా నడుపుతూ, రెండు చేతులు వదిలేసి స్టంట్లు చేసే వీడియోలను సోషల్ మీడియాలో విడుదల చేయడం విమర్శలకు దారితీసింది.
- మరొక వీడియోలో మహిళలతో కలిసి జీజేఎం రికార్డింగ్ డ్యాన్సులు చేస్తున్నారు. అశ్లీల నృత్యాలు చేస్తూ యువతకు ఏం సందేశమిస్తున్నారని చిత్తూరు వాసులు ప్రశ్నిస్తున్నారు.
- ఇంకొక వీడియోలో తనకు అంగరక్షులు ఉన్నారనే అర్థం వచ్చేలా ఇద్దరు వ్యక్తులకు పొడవాటి తుపాకులు ఇచ్చి వాటిని కూడా వీడియో తీసి పెట్టాడు. ఈ వీడియో ఎక్కడ తీశారో..? అసలు అందులో కనిపిస్తున్న అంగరక్షకుల వద్ద ఉన్న తుపాకులకు లైసెన్స్ ఉందా.? కాల పరిమితి అయిపోయిందా..? అనే వివరాలు తెలియడంలేదు. దీని ద్వారా తానో డాన్‌గా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ఇటీవల చిత్తూరులో టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రసాదరావుతో కలిసి ప్రచారానికి జీజేఎం వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మహిళలతో మాట్లాడారు. తాను ఎక్కడికి వెళ్లినా నీళ్లు లేవు, రోడ్లు లేవు అంటున్నారని, ఇక్కడ నేను కాదు కదా ఉండేది.. ఇచ్చేది అని దురుసుగా ప్రవర్తించారు. ఈ వీడియో వైరల్ కావడంతో చిత్తూరు వాసులు ఈయనకు ఓటేసినా ఏమాత్రం ప్రయోజనం ఉండదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.



బైక్‌పై చేతులు వదిలేసి స్టంట్లు చేస్తున్న జీజేఎం

ఐదో రోజు 24 నామినేషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఐదో రోజు 22 మంది 24 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఆర్ఓ లు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. చిత్తూరు పార్లమెంట్‌కు నలుగురు అభ్యర్థులు నాలుగు సెట్లు, ఏడు అసెంబ్లీల్లో 18 మంది అభ్యర్థులు 20 సెట్లు నామినేషన్‌లు దాఖలు చేశారు. అందులో భాగంగా చిత్తూరు పార్లమెంట్ స్థానానికి రమేష్ (ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ), జగపతి (కాంగ్రెస్), జయకర్ (ఇండిపెండెంట్), భూలక్ష్మీ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) తమ నామినేషన్‌లను ఆర్ఓ షణ్మోహన్‌కు అందజేశారు. అలాగే చిత్తూరు అసెంబ్లీ స్థానానికి విజయానందరెడ్డి (వైఎస్సార్‌సీపీ) నాలుగో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. పుంగనూరులో సురేష్ (బహుజన్ సమాజ్‌పార్టీ),నగరిలో చిట్టిబాబు (నీతినిజాయితీపార్టీ), రాకేష్‌రెడ్డి (కాంగ్రెస్), రవికుమార్ (పిరమిడ్‌పార్టీ), భానుప్రకాష్(టీడీపీ), జీడీ నెల్లూరులో రమేష్‌బాబు (కాంగ్రెస్), మునస్వామి (టీడీపీ), గుణశేఖర్ (సమాజ్‌వాదీ పార్టీ), పూతలపట్టులో సంతోష్‌కుమార్ (విదుతలై చిరుతైగల్‌కచ్చిపార్టీ), విజయభాస్కర్ (ఇండిపెండెంట్), పలమనేరులో సుబ్రమణ్యం (ఇండిపెండెంట్), శోభ (బహుజన సమాజ్‌పార్టీ), పావని(వైఎస్సార్‌సీపీ), కుప్పంలో భరత్ (వైఎస్సార్‌సీపీ), నీలమ్మ (ఇండిపెండెంట్), నాగరాజు (ఇండిపెండెంట్)నామినేషన్లు సమర్పించారు.



చిత్తూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలోకి చేరిన మీరాసాహెబ్‌పాళెం నేతలతో మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ

నగరి : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. అందులో భాగంగా నగరి మండలం మీరాసాహెబ్ పాళానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా సమక్షంలో మంగళవారం పార్టీలోకి వచ్చేశారు. ఇందులో విశేష మేంటంటే.. గ్రామానికి చెందిన టీడీపీ వారికే స్థానిక నేత ఒకరు పచ్చ కండువాలు కప్పి, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వలస వచ్చారంటూ కలరింగ్ ఇచ్చారు. దీంతో సదరు నాయకులు, కార్యకర్తలు ఇదేంటి ఇలా చేశారు అంటూ మదన పడ్డారు. గ్రామాన్ని దత్తత తీసుకుని మంత్రి రోజా చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, ఎంపీటీసీ సభ్యుడు ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో నేరుగా ఆమెను కలిసి వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. వారికి మంత్రి రోజా కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో అబ్దుల్ నబీ, మహమ్మద్ అనీఫ్, సత్తార్, జైల, రసూల్, బాబా, ఖాదర్, జేకే సత్తార్, జైలా బ్దీన్, హరుణ్ తదితరులు ఉన్నారు.

గంగవరంలో 10 కుటుంబాలు

గంగవరం : మండలంలోని దండపల్లె పంచాయతీ ఎగువ, దిగువ వేమనపల్లెకు చెందిన 10 కుటుంబాల టీడీపీ వారు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో రవి, దుర్గాప్రసాద్, సుబ్రమణ్యం, రఘు, వంశీ, శీనా, రమేష్, శివ, చరణ్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి/వి.కోట : మండలంలోని నిడిగుంట పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు చంద్ర వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే వికోట మండలం నెల్లిపట్ల, చిన్నాగనపల్లెకు చెందిన గోవిందప్ప, పెద్దోడు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



టీడీపీ నేతకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

తవణంపల్లెలో ..

తవణంపల్లె : టీడీపీ స్థానిక నేత మునస్వామిశెట్టి మరో పదిమంది అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు హరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఎంపీటీసీ సభ్యుడు కిసాన్ బాబు, జానకీరాంశెట్టి, రెడ్డెప్ప, మధుకుమార్, కోదండ పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం : పట్టణ పరిధిలోని దళవాయి కొత్తపల్లెకు చెందిన 25 కుటుంబాలవారు ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ భరత్‌ను గెలిపించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు.



టీడీపీ నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తలపై కేసు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్‌పీఎస్ మద్యం బార్‌లో సోమవారం తప్పతాగి తన్నుకున్న టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో టీడీపీ కార్యకర్తలు తవణంపల్లెకు చెందిన ఉపేంద్ర అనే వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేశారు. పైగా రోడ్లపైకి వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటుండగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లె మండలానికి చెందిన పురుషోత్తం, వెంకటేష్, శంకరయ్య మరో ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిత్తూరు వన్‌టౌన్ ఎస్ఐ షేక్‌షావలీ తెలిపారు.

కొబ్బరి, మామిడి చెట్లకు నిప్పు



కాలిన కొబ్బరి, మామిడి చెట్లు

గుడిపాల: మండలంలోని 189కొత్తపల్లె పంచాయతీ మిట్టూరులో నందకుమార్‌రెడ్డి, శోభ అనే రైతులకు చెందిన ఐదు ఎకరాల్లోని కొబ్బరి, మామిడి చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. ఆ ప్రాంతంలో గడ్డి ఏపుగా ఎదిగి ఉండడంతో మంటలు త్వరితగతిన వ్యాపించి చెట్లు పూర్తిగా దగ్ధమైనట్లు బాధిత రైతులు తెలిపారు. మామిడి పూత బాగా పట్టిందని, మంచి దిగుబడి వచ్చే అవకాశమున్న తరుణంలో ఆశలు బుగ్గిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

ఇద్దరు వేటగాళ్ల అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు

గుడిపాల : మండలంలోని చీలాపల్లె సమీపంలో రాసనపల్లె వద్ద ఫారెస్ట్ అధికారులు ఇద్దరు వేటగాళ్లను మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. బంగారుపాళ్యం మండలం రాగిమాను పెంట సీజేఎఫ్ కాలనీకి చెందిన మణికంఠ, మురుగేష్ ఇద్దరూ కలిసి అడవి పందులను చంపి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు తూర్పు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ థామస్ తెలిపారు. నిందితులు రెండు సంచుల్లో పందులను వేసుకుని ద్విచక్ర వాహనంపై తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడిలో డీఆర్‌ఓ రణ్‌సింగ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మధు, గౌష్‌బాషా, హయత్‌బాషాలు పాల్గొన్నారు.

అరేయ్.. ఆ కాషాయం జెండా తీసేయండ్రా!



ముస్లిం నేతల భేటీలో బీజేపీ కండువా లేకుండా టీడీపీ అభ్యర్థి గురజాల

చిత్తూరు అర్బన్: చిత్తూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్ మోహన్ నాయుడు (జీజేఎం)కి కాషాయ జెండాతో కొత్త సమస్య వచ్చి పడుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ప్రకటించుకున్న ఆయన ఎన్నికల ప్రచారంలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల రంజాన్ రోజున చిత్తూరులోని ఈద్గాకు వెళ్లిన జీజేఎంకు ముస్లింల నుంచి వ్యతిరేకత ఎదురైన విషయం తెలిసిందే. మతతత్వ బీజేపీకి తాము ఓట్లు వేయమని, ఈద్గాలోకి ఎందుకు వచ్చారంటూ ముస్లింలు నిలదీసిన విషయాన్ని జీజేఎం మర్చిపోలేదు. గతంలో ఎప్పుడు ప్రచారానికి వెళ్లినా టీడీపీ, జనసేన, బీజేపీ కండువాలు వేసుకుని వెళ్లే జీజేఎం.. తాజాగా ముస్లింలను కలిసేప్పుడు మాత్రం బీజేపీ కండువాను పక్కన పెట్టేస్తున్నారు. టీడీపీ నేతలు కూడా కాషాయం కండువా వేసుకోవద్దని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం 34వ డివిజన్‌లో టీడీపీ మైనారిటీ విభాగం నాయకుడు జాఫర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ముస్లింలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జీజేఎం అనుచరులు కొందరు మరచిపోయి బీజేపీ జెండా చేతపట్టుకుని వచ్చారు. ఇది చూసిన జీజేఎం ''అరేయ్.. ఆ కాషాయం జెండా అవతల పడేయండ్రా' అంటూ హుకుం జారీ చేశారు. చిత్తూరు బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముస్లిం మైనారిటీల సమావేశంలో కూడా టీడీపీ అభ్యర్థితో పాటు నేతలు ఎవరూ కాషాయ కండువాలు ధరించకపోవడం కొసమెరుపు.

వైఎస్సార్‌సీపీ వెంటే దళితులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

తవణంపల్లె : జిల్లాలోని దళితులు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నట్లు వారు అమ్ముడుపోయే స్థితిలో లేరని ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎగువమత్యంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో దళితుల ఓట్లతోనే తాము అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో టీడీపీకి దళిత నేతలు లేకపోవడంతో బాపట్ల నుంచి అభ్యర్థిని తీసుకువచ్చారని విమర్శించారు. జగనన్న నాయకత్వంపై దళితులకు నమ్మకం ఉందని, ఇంటింటి ప్రచారంలో ఆ విషయం తెటతెల్లమవుతోందని వెల్లడించారు. టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఎంపీపీ ప్రతాప్‌సుందరరాయల్ రెడ్డి, శరత్ రెడ్డి, శర పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, కుమారస్వామి నాయుడు, శివ, వసంతరెడ్డి పాల్గొన్నారు.

59 మంది వలంటీర్ల రాజీనామా

పూతలపట్టు: మండలంలో మంగళవారం మొత్తం 59 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పూతలపట్టు1,2 , పి.కొత్తకోట పంచాయతీ, పోలవరం పంచాయతీ పరిధిలోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ప్రసన్నకుమారికి అందజేశారు. టీడీపీ, జనసేన నేతల వేధింపులు, అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఇకపై ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా పనిచేస్తామని తెలిపారు.



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం

గుడిపాల: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కన సీపీఎఫ్ కంపెనీ వెనుక వైపు అటవీప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం (40 ఏళ్లు) ఉన్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440796712 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

చెక్ పోస్టుల్లో పటిష్ట నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న హిమవంశీ

బంగారుపాళెం: రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా ఉంచాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. మండలంలోని కొదలమడుగు చెక్ పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అక్రమంగా మద్యం, నగదు తరలించే అవకాశం ఉండడంతో తనిఖీలు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం యాదమరి మండలం కనికాపురంలోని ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేశారు.

టెన్త్ రీ వెరిఫికేషన్, కౌంటింగ్‌కు అవకాశం

- ఈనెల 30 వరకు దరఖాస్తు గడువు
- మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : పది ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్న విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటును విద్యాశాఖ అధికారులు కల్పించారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ చేసుకునేందుకు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంకు దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. పాస్ అయినా/ఫెయిలైనా ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ. ఇన్‌వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్/రీ కౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫీజులను ఆయా హెచ్‌ఎం లాగిన్ నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.1000, రీ కౌంటింగ్‌కు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. రీ కౌంటింగ్/రీ వెరి ఫికేషన్‌కోసం విద్యార్థులకు ప్రతి పాఠశాల హెచ్‌ఎం/సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

సూచనలు పాటించాలి..

విద్యార్థులు దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలతో అటెస్టేషన్ చేయించి, విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోనవసరం లేదు. రీ వెరిఫికేషన్ అంటే పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తా రు. రాసిన సమాధానాలన్నింటికీ మార్కులు వచ్చాయా లేదా అని ధ్రువీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే, దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసిన విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీ కౌంటింగ్ విషయంలో మార్కుల మొత్తం మరోసారి లెక్కిస్తారు. తప్పుగా కూడి ఉంటే సరి చేసి మార్కులు వేస్తారు. రీ కౌంటింగ్‌లో పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ దరఖాస్తు ఇలా..

పదవ తరగతి పరీక్షలు ఫెయిలైన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా విద్యాశాఖ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనుంది. మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. టైమ్ టేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. పరీక్ష ఫీజును బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించే వీలుంది. మే ఒకటి నుంచి 23వ తేదీ వరకు రూ.50ల అపరాధ రుసుంతో ఫీజును చెల్లించాలి.

వడదెబ్బకు మహిళ మృతి



కృష్ణమ్మ (ఫైల్)

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళం దళితవాడకు చెందిన ఎం.కృష్ణమ్మ(55) మంగళవారం వడదెబ్బ తగిలి మృతి చెందింది. బంధువుల కథనం మేరకు.. కృష్ణమ్మ ఇంటివద్ద పనిచేస్తూ ఎండ వేడిమి తట్టుకోలేక పడిపోవడంతో గ్రామంలోని పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు.

దివ్యాంగురాలిపై లైంగికదాడి

చౌడేపల్లె : మండలంలోని ఆమినిగుంట గ్రామంలో దివ్యాంగురాలిపై లైంగిక దాడి జరిగినట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. సోమవారం రాత్రి బాధితురాలు ఇంట్లో ఉండగా గ్రామానికి చెందిన వెంకటరమణ అలియాస్ రాము మద్యం సేవించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

పుత్తూరు: స్థానిక బైపాస్ రోడ్డులోని తొరూరు క్రాస్ వద్ద మంగళవారం జరిగినప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నారాయణవనం మండలం కొండలచెరువు గ్రామానికి చెందిన కె.సుబ్రమణ్యంరెడ్డి(73) రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి నారాయణవనం వైపు వెళుతున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనల పెంపే లక్ష్యం

ఏర్పేడు: అధ్యాపకులు, విద్యార్థులలో అభ్యాసాన్ని ప్రోత్సహించడం, పరిశోధనలను పెంపొందించడం ఐఐటీ ప్రాథమిక లక్ష్యమని ఐఐటీ తిరుపతి అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ డీన్, యాక్టింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ఎంఎస్ రాఘవరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ప్రపంచ పుస్తక, కాపీరైట్ దినోత్సవం సందర్భంగా నూతన లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్, ఇంజినీరింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాల్లో ఇటీవలి పోకడలపై సుమారు ఐదు వేల పుస్తకాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. పాఠ్యపుస్తకాల నుంచి సూచన, పరిశోధన పుస్తకాల వరకు ఉంటాయని చెప్పారు. ఎగ్జిబిషన్‌లో ప్రఖ్యాత రచయితలు, ప్రచురణ కర్తల నుంచి పుస్తకాల సమగ్ర సేకరణను ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు లైబ్రరీ విద్యార్థులకు అందుబాటుతో ఉంటుందన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రశాంతకుమార్ బెహెరా, లైబ్రరీ అడ్వైజరీ కమిటీ నేతృత్వంలో సేకరణ అభివృద్ధికి, సాహిత్య అన్వేషణకు వేదికగా పనిచేస్తుందన్నారు. లైబ్రరీ చైర్మన్ ప్రొఫెసర్ రఘురామరాజు, కన్వీనర్ డాక్టర్ అరుణ్ కే.మన్నా, అసిస్టెంట్ లైబ్రేరియన్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.



అధ్యాపకులు, విద్యార్థులతో రాఘవరావు

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



పాఠశాల టాపర్ వైష్ణవి



చర్మిళ



రిషిత



కార్తీక్



గణేష్

చౌడేపల్లె: చౌడపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి ప్రవేటు విద్యాసంస్థలో పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 110 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలించిందన్నారు. జి.చర్మిళ 577 మార్కులు, ఎం.రిషిత 572 మార్కులు, ఎం.కార్తీక్ 571మార్కులు, ఎం.గణేష్ 571 మార్కులు సాధించినట్టు తెలిపారు. మరో 36 మంది విద్యార్థులకు 500 మార్కులకు పైగా వచ్చినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను,ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపల్ జ్యోతి రాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

సాహిత్యంపై యువత మక్కువ చూపాలి



జెడ్పీ చైర్మన్‌ను సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

వి.కోట: కాలానుగుణంగా మారుతున్న జీవనశైలిలో యువత సాహిత్యం, తెలుగు సంప్రదాయాలపై మక్కువ పెంచుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాగశ్రీ పాఠశాల ఆవరణలో స్థానిక కళాభారతి సంస్థ, అమ్మాయాక్స్‌సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ నేడు యువత సెల్‌ఫోన్ మోజులో పడి పుస్తక పఠనం మరచిపోతున్నారని తెలిపారు. అమ్మాయాక్స్ సంస్థ ఆధ్వర్యంలో 100 మంది కవుల రచించిన కవితలతో ముద్రించిన పుస్తకాన్ని జెడ్పీ చైర్మెన్ ఆవిష్కరించారు. అమ్మాయాక్స్ సంస్థ అధ్యక్షుడు దశరథరెడ్డి, కళాభారతి సంస్థ అధినేత రఘుపతి, పెద్ద సంఖ్యలో సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

బోయకొండలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

చౌడేపల్లె: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో కొలువుదీర్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి, ఉభయదారులతో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున నిర్వహించే చండీహోమ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అశేషంగా విచ్చేస్తున్నారు. పూర్ణాహుతి అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



కాలిన గాయాలతో హరీష్

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ వినాయక్ నగర్‌లో మంగళవారం ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. మోటుమల్లెల గ్రామానికి చెందిన హరీష్(21) వినాయక్ నగర్‌కు చెందిన యువతి శ్రావణిని రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో పీలేరు మండలం తలపలకు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.50 వేల అప్పు చేశాడు. . ఆ డబ్బు సకాలంలో ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తి ఉదయం అత్తగారింట్లో ఉన్న హరీష్‌ను నిలదీశాడు. దీంతో మనస్తాపం చెందిన హరీష్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబీకులు వెంటనే 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ యువిన్‌పై శిక్షణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం అడల్ట్ బీసీజీ టీబీ యువిన్‌పై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ యువిన్ టీకా వేసుకున్న వారి వివరాలను ఏవిధంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలో వివరించారు. అనంతరం టీకాకు అర్హులైన వారి వివరాలను వెల్లడించారు.